# సమగ్ర సాగునీటి విధానం రూపొందించి అమలుచేయాలి

**ఇకనుండి** రైతాంగం సేద్యాన్ని బోర్లద్వారానే చేయాలని, రాష్ట్రంలో భూగర్భ జలాలకు కొరతలేనిచోట ప్రభుత్వ ఖర్చుతో లక్షబోర్లను త్రవ్వించి, మోటార్లు కూడా బిగించిఇవ్వాలని రాష్ట్రమంత్రివర్గం నిర్ణయించింది. జిల్లాల వారీగా బోర్ల కేటాయింపును ప్రకటించింది. విద్యుత్ కనెక్షన్, మోటారుకయ్యే ఖర్చులలో ఎస్సీ, ఎస్టీ రైతులు 5శాతం, ఇతరులు 20శాతం భరించాలి. ఎన్టీఆర్ జలసిరి రెండో దశక్రింద అనంతపురం జిల్లా మినహా రాష్ట్రమంతటా ఈ పథకం అమలౌతుంది.

రాష్ట్రంలోని 12 జిల్లాల్లో ఆయకట్టు(కమాండ్), ఆయకట్టేతర(నాన్‌కమాండ్) ప్రాంతాల్లో బోర్లు త్రవ్వించిన తర్వాత సబ్సిడీ క్రింద సూక్ష్మసేద్యం సౌకర్యం కూడా కల్పించబడుతుందని సేద్యస్వభావాన్ని గూడా వెల్లడించింది. ఈ పథకానికి 1496 కోట్లు ఖర్చు అవుతుంది. అందుకు గ్రామీణ ఉపాధిహామీ పథకం క్రింద 377.15, ఏపీ ట్రాన్స్‌కో నుండి 621.75, రాష్ట్రప్రభుత్వం 307.14, లబ్ధిదారులు 190.25 కోట్లు నిధులు సమకూర్చాల్సివుంది. ఒక్కో బోరుక్రింద 5 ఎకరాల చొప్పున 12 జిల్లాల్లో 6.12 లక్షల ఎకరాలకు సాగునీటిభద్రత కల్పించటం జరుగుతుందని పేర్కొన్నారు.

బోరు త్రవ్వకానికి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌నంబర్‌తో కలెక్టర్ నేతృత్వంలో వున్న జిల్లా కమిటీలకు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకొన్న రైతు పొలాల్లో బోర్లువేయటానికి వీలున్న ప్రాంతాలపై భూగర్భజలశాఖ జియాలజిస్టులతో అధ్యయనం చేయించి, అనువైన ప్రాంతాన్ని గుర్తించి ధృవీకరణపత్రాన్ని ఇస్తుంది. గుర్తించిన ప్రాంతంలో గంటకు 4500 లీటర్ల నీరువస్తేనే సిఫార్స్ చేయటం జరుగుతుంది. ఆయకట్టు ప్రాంతంలో 200, ఆయకట్టేతర ప్రాంతంలో 300 అడుగుల బోరువేయాలి. ప్రభుత్వం నిర్దేశించిన జాబితాలోని ఐఎస్ఐ మార్క్ మోటార్లను కొనుగోలుచేయాలి. ఉద్యానవనశాఖ బిందు, తుంపర సేద్యం ఏర్పాటుచేస్తుంది.

బోరు త్రవ్వకానికి అడుగుకి 80 రూ. లెక్కన గ్రామీణ ఉపాధి పథకం క్రింద రైతుకు చెల్లిస్తారు. విద్యుత్ కనెక్షన్‌కోసం ఏపీట్రాన్స్‌కో 50వేల వరకు భరిస్తుంది. అంతకుమించితే రైతులే భరించాలి. మోటారు పరికరాలకోసం ప్రభుత్వం 40వేలు ఇస్తుంది. మిగిలింది రైతులే భరించాలి. విద్యుత్ కనెక్షన్, మోటారుకు 90వేలు ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనాగా వుంది.

బోర్లుత్రవ్వకం ద్వారా సేద్యం సాఫీగా సాగుతుందనే ప్రభుత్వ ప్రచారంలోని వాస్తవం ఏమిటి? కొత్తగా బోర్ల ఏర్పాటును ప్రభుత్వం ముందుకు తేవటంలో ఉద్దేశం ఏమిటి? ఈ పథకం రైతుల ప్రయోజనం కోసమేనా అన్న అంశాలను చూడాల్సివుంది.

సేద్యానికి సాగునీరు అతిముఖ్యమైనది. నీరు అందించటం ప్రభుత్వం బాధ్యత. రాష్ట్రంలో అవసరమైన సగటు వర్షపాతం, భూగర్భజలాలు వున్నాయి. వీటిని సరైనవిధంగా వినియోగిస్తే సాగునీటి సమస్య ఏర్పడదు. గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా, తుంగభద్ర మొదలైన నదులు రాష్ట్రంలో ప్రవహిస్తున్నాయి. వర్షం, వరదల ద్వారా వచ్చే నీటిని రిజర్వాయర్లు, ప్రాజెక్టుల ద్వారా నిల్వచేయవచ్చు. రాష్ట్రంలో నీటి లభ్యతకు ఇలాంటి అవకాశాలు వున్నా దాన్ని వినియోగంలోకి తేవటంలో ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యం ఫలితంగా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు శాశ్వత కరువుపీడిత ప్రాంతాలుగా కొనసాగుతున్నాయి. బడా పరిశ్రమ దారులకు ఈ ప్రాంతాల నుండి చౌకగా కూలీల సరఫరా జరుగుతున్నది. నిత్యకరువు జిల్లాగా కొనసాగుతున్న అనంతపురంతోపాటు, కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లోని అనేక ప్రాంతాలకు సాగునీరు అందక సేద్యం సాగటంలేదు.

59 సంవత్సరాలుగా రాష్ట్రాన్ని పాలించిన, పాలిస్తున్న కాంగ్రెస్ – తెలుగుదేశం ప్రభుత్వాలు సాగునీరు అందించటంలోనూ, రిజర్వాయర్లు, ప్రాజెక్టులు నిర్మించటంలో పూర్తిగా విఫలమైనాయి. ఫలితంగా ఎన్నోవిధాల ఉపయోగపడే వేలాది టి.ఎం.సి.ల నీరు సముద్రం పాలౌతున్నది. కాల్వల ద్వారా సాగునీరు అందక రైతాంగం బోర్ల సేద్యాన్ని ఆశ్రయించటం, ఆ సేద్యం విపరీతంగా పెరగటంతో భూగర్భజలాలు అడుగంటిపోయి నీరు అందని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా సాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది.

2004లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చింది. సాగునీరు ఎడల రైతుల ఆకాంక్షను, ఆందోళనను గమనించిన రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం 2005లో జలయజ్ఞం పేరుతో అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసింది. 10 సం॥ కాంగ్రెస్ పాలనలో వాటిల్లో ప్రధానమైన ప్రాజెక్టులేవీ పూర్తికాలేదు. ప్రాజెక్టుల పనుల్లోమాత్రం అవినీతి కంపు గుబాళించి వేలాదికోట్లు దుర్వినియోగమయ్యాయి.

ప్రాజెక్టులు పూర్తిచేసి సాగునీరు అందిస్తానని ఎన్నికల ప్రణాళికలో తెలుగుదేశం పార్టీ రైతులకు వాగ్దానం చేసింది. అధికారంలోకి వచ్చిన తర్వాత తన సహజ స్వభావంతో చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాన్ని విస్మరించింది. సాగునీటి ప్రాజెక్టులకోసం బడ్జెట్‌లో కేటాయింపులే అందుకు నిదర్శనం. కాంగ్రెస్ పాలనలో 90 శాతం పైగా పూర్తిచేసిన తోటపల్లి రిజర్వాయర్, పులిచింతల ప్రాజెక్టు, హంద్రీనీవా ఇంకా అనేక ప్రాజెక్టులను కూడా పూర్తిచేయలేదు. రైతాంగం అసంతృప్తిని దారిమళ్లించేందుకు పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని ముందుకు తెచ్చింది. ఈ పథకం ద్వారా గోదావరి నీటిని ప్రకాశం బ్యారేజీకి మళ్ళించి రాయలసీమకు నీరు అందిస్తాననే ప్రచారం చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్నది. పట్టిసీమ పథకానికి 16 వందల కోట్లకుపైగా

ఖర్చుఅవుతుందని ప్రభుత్వం చెబుతున్నది. ఈ పథకంద్వారా గోదావరి నీరు ప్రకాశం బ్యారేజీకి మళ్లించటం, రాయలసీమకు నీరు అందించటం ఆచరణలో నేడు జరగదు. ఈ ప్రాజెక్టులో వందలకోట్లు ప్రభుత్వ అధినేతల అవినీతికి నిలయంగా మారింది.

ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులవలన రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో లక్షలాది ఎకరాల్లో సేద్యం మూలనపడింది. భూగర్భజలాలు అడుగంటి బోర్లసేద్యం సంక్షోభంలో పడింది. వేసిన పంటలు ఎండిపోయాయి. కొన్ని దశాబ్దాల కాలంలో ఎప్పుడూ లేనివిధంగా కృష్ణా డెల్టాకు సాగునీరు విడుదల చేయలేదు. వేలాది రూపాయలు ఖర్చుచేసి బోర్లద్వారా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రైతాంగం పంటలు వేసినా, వరి పైరు పొట్టదశలో ఉన్నప్పుడు భూగర్భజలాలు పడిపోవటంతో పైరుకి నీరు అందించలేక రైతాంగంపడే అవస్థలు మాటల్లో చెప్పటం సాధ్యంకాదు. విద్యుత్తు కేంద్రాలకు నీరు అందించటంకోసం 11.5 అడుగుల నీటి మట్టాన్ని ప్రకాశంబ్యారేజీవద్ద నిల్వవుంచటంకోసమే కృష్ణా – డెల్టా కాల్వలకు ప్రభుత్వం నీరు విడుదల చేయకపోవటంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయే పరిస్థితి పొంచివుంది. ప్రకాశం బ్యారేజీ నిర్మాణం, సాగునీటి ప్రాధాన్యత కోసమన్న వాస్తవాన్ని చంద్రబాబు ప్రభుత్వం ప్రక్కనపెట్టింది.

సాగునీరు, దుర్భిక్ష పరిస్థితులు రైతాంగాన్ని వెంటాడుతున్నప్పుడు, వారి ప్రయోజనం, రాష్ట్ర ప్రయోజనాలు కోరుకొనే ప్రభుత్వమైతే వాటిని ఎదుర్కొనేందుకు సరైన విధానాలు అమలుపర్చేది. అన్నిరకాల నీటి వనరులను కాపాడుకొనేవిధంగా వాటిని నిల్వచేసేందుకు ప్రాధాన్యమిచ్చి రిజర్వాయర్లతోపాటు అవసరమైన ప్రాజెక్టుల నిర్మాణం యుద్ధప్రాతిపదికపై చేపట్టేది. అలాంటి చర్యలు చంద్రబాబు ప్రభుత్వం తీసుకోకుండా మోటారుబోర్ల పథకం ముందుకు తేవటమంటే దానికి ఆ ఉద్దేశం లేదని స్పష్టమౌతుంది. రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతూవున్నాయి. వర్షపునీరు ఇంకక పోవటంవలన, బోర్లసేద్యం ఎక్కువవటంవలన భూగర్భ జలాలు తీవ్రంగా పడిపోయి సాగునీరు అందించలేక బోర్లు వెలవెలబోతున్నాయి. వీటి క్రింద సేద్యం చిన్నబోతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో మోటారుబోర్ల పథకంద్వారా సేద్యానికి నీరు అందిస్తానని చంద్రబాబు ప్రభుత్వం చెప్పటం రైతాంగాన్ని వంచనకు గురిచేయటమే కాకుండా రిజర్వాయర్ల నిర్మాణం ద్వారా సాగునీరు అందించే విధానానికి తిలోదకాలు ఇచ్చేందుకే. భూగర్భ జలాలు దారుణంగా పడిపోయి ఇప్పటికే బోర్లకు నీరు అందని పరిస్థితుల్లో చంద్రబాబు బోర్లపథకం అమల్లోకి వస్తే భూగర్భజలాల పరిస్థితి ఏవిధంగా వుంటుందోనన్న ఆందోళన కన్పిస్తున్నది. ఈ పథకంవలన భూగర్భజలాలు కనుమరుగవటమే కాకుండా విపరీతమైన వేడిగాలులు వీచి వాతావరణం కలుషితమైపోతుంది. రైతాంగాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతుంది.

చంద్రబాబు ప్రభుత్వం మోటారు బోర్లుపథకం, సాగునీటినే కాకుండా ఆహారధాన్యల ఉత్పత్తిని దెబ్బ తీస్తుంది. ఈ పథకం ద్వారా రైతాంగం బిందుసేద్యం చేయాలని, అందుకు సహాయం అందిస్తామని చంద్రబాబు సంకేతాలు అందజేశాడు. అధికనీరు అవసరమయ్యే పంటలను మానుకొని తక్కువ నీరు అవసరమయ్యే ఎగుమతి పంటలను బిందుసేద్యం ద్వారా పండించమని పాలకులపై ప్రపంచబ్యాంకు వత్తిడిచేస్తూనే వుంది. పాలకులు అందుకు అంగీకారంగా దాన్ని ప్రోత్సహిస్తున్నారు. సామ్రాజ్యవాదులకు, ప్రపంచ బ్యాంకుకు నమ్మినబంటుగా వున్న చంద్రబాబు మోటారు బోర్లసేద్యం పథకంద్వారా వాటి విధానాలను అమలుచేసే చర్యలు తీసుకొన్నాడు. ఆహారధాన్యాల స్థానే పండ్లు, కూరగాయలు, మొక్కజొన్న, పూలు మొదలైన పంటలు పండించి పెట్టుబడిదారీ దేశాల సంపన్నుల అవసరాలు తీర్చేందుకు ఎగుమతులు చేస్తారు. ఇది కూడా కార్పొరేట్ సంస్థలే చేస్తాయి. సాగునీరు అందక, బిందుసేద్యం వలన ఆహారపంటల సాగుపడిపోయి, వాటి ఉత్పత్తులు గణనీయంగా తగ్గుతాయి. ఫలితంగా ఆహారధాన్యాలను సామ్రాజ్యవాద దేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. ఇదే సామ్రాజ్యవాదులు, ప్రపంచబ్యాంకు కోరుకుంటున్నది.

సామ్రాజ్యవాదుల, ప్రపంచబ్యాంకు సూచనలకు అనుగుణంగా సాగునీరు, పంటలకు న్యాయమైనధరలు, మార్కెట్ సౌకర్యం కల్పించకుండా, సేద్యపు ఖర్చులు పెరిగేలా ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల ధరలు పెంచి, 'సేద్యం దండగ' అన్న అభిప్రాయం కల్పించి, రైతాంగం సేద్యం నుండి వైదొలగేలా చేసి, వారి భూములను కార్పొరేట్, కాంట్రాక్టు సేద్యానికి అప్పగించేలా చేయటమే చంద్రబాబు మోటారు బోర్ల సేద్య పథకం ఉద్దేశ్యం!

ఎన్టీఆర్ పాలన కాలంలో ఇలాంటి పథకాన్నే అమలుచేశారు. పశ్చిమగోదావరి జిల్లా మెట్ట ప్రాంతాల్లో ఇది అమలుజరిగే పేద రైతాంగం కూడా బోర్లు వేసుకొని సేద్యంచేయగలిగారు. కాగా భూగర్భజలాలను తిరిగి నింపేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఫలితంగా పదేళ్ళు గడిచేసరికి భూగర్భ నీటిమట్టాలు పడిపోయి, 600 అడుగులు వేసినా నీరు పడనిస్థితి ఏర్పడింది. ఇది పేద, మధ్యతరగతి రైతాంగంపై భారాన్ని పెంచింది. ఈ పథకం అమలుజరిగితే ఇది కూడా రైతాంగాన్ని కోలుకోలేని సంక్షోభంలోకే నెడుతుందని ఈ అనుభవమే తెలుపుతున్నది.

చిన్న నీటివనరులు, చిన్న నీటిప్రాజెక్టులు, భారీ ప్రాజెక్టులు, భూగర్భజలాల వినియోగాన్ని శాస్త్రీయంగా వినియోగించుకొనే సమగ్ర నీటి వినియోగ పథకాన్ని రచించి అమలుచేయాలని రైతాంగం డిమాండు చేయాలి. సమగ్రవిధానం లేకుండా, ఏదో ఒక పద్ధతిని తలకెత్తు కుంటే, అది రైతాంగంపాలిట శాపంగా పరిణమిస్తుంది.

అన్నిరకాల శాస్త్రీయ విజ్ఞానం, పద్ధతులు అందుబాటులో ఉన్నా పాలకులు తాత్కాలిక ఉపశమన విధానాలతో రైతాంగాన్ని బుజ్జగించటం వెనుక లోతైన కుట్ర వుంది. రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టి వారిని భూమి నుండి తప్పించే లక్ష్యం వుంది. ఇది గుర్తెరిగి రైతాంగం సమిష్టి పోరాటాలకు సిద్ధం కావాలి.

ooooo